ఆర్థిక సంఘం... వ్యవస్థీకరణ - విధులు

సమాఖ్య వ్యవస్థ కలిగిన అన్ని దేశాల్లో జాతీయ-ప్రాంతీయ ప్రభుత్వాల మధ్య వనరుల విభజనలో హేతుబద్ధమైన సూచన లిచ్చేందుకు తగిన యంత్రాంగాన్ని రూపొందించడం జరుగుతోంది. మన దేశంలో ఆర్థిక సంఘమనే రాజ్యాంగబద్ధ వ్యవస్థ ఏర్పాటుకు రాజ్యాంగంలోని 280వ ప్రకరణ అవకాశం కల్పిస్తోంది. ప్రతి ఐదేళ్లకోసారి, లేదా అవసరాన్నిబట్టి అంతకంటే ముందుగానే రాష్ట్రపతి ఈ బహుసభ్య సంఘాన్ని ఏర్పాటు చేస్తారు.1951లో అమల్లోకి వచ్చిన ఆర్థిక సంఘం చట్ట నిబంధనల మేరకు ఈ సంఘంలో అధ్యక్షుడు, నలుగురు సభ్యులుంటారు. ప్రజా కార్యకలాపాలలో అనుభవమున్న వ్యక్తిని అధ్యక్షుడిగా నియమిస్తే.. మిగితా సభ్యులు ఈ కింది రంగాలకు చెందినవారై ఉంటారు. i) హైకోర్టు న్యాయమూర్తి లేదా ఆ మేరకు అర్హత కలిగిన వ్యక్తి, ii) విత్త వ్యవహారాలలో, ఖాతాల నిర్వహణలో అనుభవం కలిగిన వ్యక్తి, iii) విత్త, పాలనా రంగంలో అనుభవం కలిగిన వ్యక్తి, iv) ఆర్థిక విషయాలలో నిపుణుడైన వ్యక్తి. మొదటి ఆర్థిక సంఘం 1951లో కె.సి.నియోగి అధ్యక్షతన ఏర్పాటైంది. ఇప్పటి వరకూ 13 ఆర్థిక సంఘాలు ఏర్పాటయ్యాయి. వీటికి నిర్ణీత పదవీకాలం ఉండదు. సాధారణంగా రెండు సంవత్సరాలలోపు తమ నివేదికను సమర్పిస్తాయి. వీటి పరిధిని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ రూపొందిస్తుంది.

ఈ కింద ప్రస్తావించిన అంశాలకు సంబంధించి ఆర్థిక సంఘం సిఫార్సులు చేస్తుంది: ఎ) కేంద్ర ప్రభుత్వం వసూలు చేసిన పన్నులలో ఏ మేరకు (ఎంత శాతం) రాష్ట్రాలకు బదిలీ చేయాలి; వాటిని ఏ ప్రాతిపదికన రాష్ట్రాల మధ్య పంచాలి. బి) భారతీయ సంఘటిత నిధి నుంచి రాష్ట్రాలకు అందించే ధన సహాయ (గ్రాంట్-ఇన్-ఎయిడ్) ప్రాతిపదిక(రాజ్యాంగంలోని 275వ ప్రకరణ మేరకు), సి) రాష్ట్రాలలో పంచాయతీల ఆర్థిక వనరులను పటిష్టం చేయడానికి, రాష్ట్ర సంఘటిత నిధిని బలోపేతం చేయడానికి మార్గాల సూచనలు (73వ రాజ్యాంగ సవరణ చట్టం), డి) రాష్ట్రాల మున్సిపాల్టీల ఆర్థిక వనరులను మెరుగు పరచడానికి, రాష్ట్ర సంఘటిత నిధిని పటిష్టం చేయడానికి సూచనలు (74వ రాజ్యాంగ సవరణ చట్టం), ఇ) ఆర్థిక సౌష్టవాన్ని(Sound Finance) దృష్టిలో పెట్టుకొని రాష్ట్రపతి నిర్దేశించిన మరి ఏ ఇతర అంశం మీదనైనా.. 13వ ఆర్థిక సంఘాన్ని 2007, నవంబరులో విజయ్ కేల్కర్ అధ్యక్షతన ఏర్పాటుచేశారు. ప్రణాళికా సంఘ సభ్యుడు బి.కె.చతుర్వేది భాగకాలిక (Parttime) సభ్యుడిగా.. ఇందిరా రాజారామన్, అబుసాలే షరీఫ్, అతుల్‌శర్మ పూర్తికాల సభ్యులుగా... సుమిత్‌బోస్ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఇది 31.10.2009 నాటికి తన నివేదికను సమర్పించే అవకాశం ఉంది. పైన ప్రస్తావించిన అంశాలతోపాటు, ఈ కింది విషయాలను కమిషన్ పరిశీలిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ఆర్థిక విష యాలను సమీక్షించి స్థిరమైన, విలువగలిగే (Sustainable) ఆర్థిక వాతావరణం ఏర్పడటానికి సూచనలు, బి) విపత్తు నిర్వహణ చర్యలను సమీక్షించి, విపత్తు నిధికి వనరులు



సమకూర్చడానికి సూచనలు, సి) కేంద్ర- రాష్ట్ర వనరుల పరిస్థితిని అంచనా వేసి, వాటిని మెరుగుపరచడానికి సూచనలు, డి) 2010వ సంవత్సరం నుంచి అమలులోకి వచ్చే వస్తువులు, సేవల చట్టం (Goods and Services Act) ఏ మేరకు ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. ఇ) ప్రభుత్వ ఖర్చుకు అనుగుణంగా నాణ్యమైన ఫలితాలు పొందడానికి సూచనలు చేస్తుంది. ప్రపంచ ఆర్థిక సంక్షోభ ప్రభావం నేపథ్యంలో.. ఇటీవల కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఆర్థిక వ్యవస్థ ఉద్దీపన కోసం ఎన్నో చర్యలు ప్రతిపా దించింది. అవి మరింత లోటు బడ్జెట్‌కు దారి తీస్తాయి. దాంతో 13వ ఆర్థిక సంఘం పని మరింత కష్టతరమౌతుంది.

గత 58 సంవత్సరాల్లో ఆర్థిక సంఘం పనితీరుపై అనేక సమీక్షలు జరిగాయి. ఆర్థిక, పాలనావేత్తల అభిప్రాయంలో ఆర్థిక సంఘాలు ఎక్కువ శాతం కేంద్ర ప్రభుత్వ ప్రయోజనాలకనుగుణంగానే సిఫార్సులు చేసాయని, రాష్ట్ర ప్రభుత్వాలపట్ల సవతి తల్లిప్రేమ చూపాయనే విమర్శ ఉంది. దీనికితోడు ప్రణాళిక సంఘం సిఫార్సుల మేరకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు తన విచక్షణనుపయోగించి 282వ ప్రకరణ కింద నిధులను బదిలీచేయడం వివాదాస్పదమైంది. ప్రణాళికా సంఘం పక్ష పాతవైఖరితో వ్యవహరిస్తోందని.. 282వ ప్రకరణ కింద జరిగే నిధుల బదలాయింపు 275వ ప్రకరణ మేరకు (ఆర్థిక సంఘ సిఫార్సుల ఆధారంగా) జరిగే నిధుల బదలాయింపుల కంటే చాలా ఎక్కువ మొత్తమని.. దాంతో రాష్ట్రాలు ప్రణాళికా సంఘానికి ఎక్కువ ప్రాధాన్యత నిస్తూ, ఆర్థిక సంఘ సిఫార్సులకు అంత ప్రాధాన్యతనివ్వడం లేదనే విమర్శ ఉంది.ఆర్థిక సంఘ ఏర్పాటులో... దాని పరిధిని నిర్ణయించడంలో... కేంద్రం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని... దాని వల్ల సమాఖ్య స్ఫూర్తి దెబ్బతింటుందనే వాదన కూడా ఉంది. పైగా ఐదేళ్లకోసారి ఏర్పాటయ్యే ఈ సంఘానికి స్వతంత్ర సచివాలయం లేదు.. అంతే కాకుండా తాత్కాలిక ప్రాతిపదికన పని చేస్తుంది కాబట్టి తగిన సమయం లేక నిత్యం మార్పులకు గురయ్యే ఆర్థిక పరిస్థితులను సరిగా విశ్లేషించలేకపోతోందనే విమర్శ కూడా ఉంది.

సూచనలు:

1) ఆర్థిక సంఘం, ప్రణాళిక సంఘం పనిలో అతి వ్యాప్తి, ఘర్షణ

నివారించాలంటే... 282వ ప్రకరణ కింద బదిలీ అయ్యే వనరులను కూడా ఆర్థిక సంఘం పరిధిలోకి తేవాలి. ఆ మేరకు రాజ్యాంగ సవరణ చేయాలి. 2) ప్రస్తుతం పాటిస్తున్న ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయం అనే కృత్రిమ భేదాన్ని తొలగించాలి. రెండురకాలైన వ్యయాలను ఆర్థిక సంఘం పరిగణనలోకి తీసుకోవాలి. 3) ఆర్థిక సంఘానికి శాశ్వత ప్రతిపత్తి కల్పించి, దాని సభ్యులను దఫాల వారిగా నియమిస్తే... నిరంతరతను సాధించడానికి వీలుంటుంది. 4)అవసరమైన మేర సచివాలయ సిబ్బందిని నియమిస్తే... కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు చూపించే గణాంకాలపై ఆధారపడకుండా... ఆర్థిక సంఘం స్వతంత్రంగా సమాచారాన్ని సేకరించి, విశ్లేషించి, హేతుబద్ధంగా సిఫార్సులు చేయడానికి వీలౌతుంది. 5) సంఘ సభ్యులను నియమించేటప్పుడు.. దాని విచారణ నిబంధనల (terms of reference)ను రూపొందించేటప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలను సంప్రదించి, వాటి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి.

యూనియన్/రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్లు:

పాలనా వ్యవస్థ సమర్థత.. అందులో పనిచేసే ఉద్యోగుల ఎంపిక, పని షరతులపై ఆధారపడి ఉంటుంది. ఆధునిక కాలంలో ప్రభుత్వోద్యోగులు ప్రతిభ ప్రాతిపదికన ఎంపికవుతున్నారు వృత్తిపరమైన నిపుణత కలిగి, నిష్పక్షపాతంగా, స్వతంత్ర ప్రతి పత్తితో వ్యవహరించే భర్తీ యంత్రాంగమే పబ్లిక్ సర్వీస్ కమిషన్. బ్రిటిషర్ల పాలనలో 1919, 1935 భారత ప్రభుత్వ చట్టాల మేరకు కేంద్ర, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ఏర్పాటయ్యాయి. స్వాతంత్ర్యానంతరం వీటికి రాజ్యాంగపరమైన హోదా కల్పించారు. రాజ్యాంగంలోని 315వ ప్రకరణ కింద యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్.. రెండు లేక అంత కంటే ఎక్కువ రాష్ట్రాలు కోరితే ఉమ్మడి పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ఏర్పాటు చేయవచ్చు. యూనియన్/ఉమ్మడి పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుల నియామకం, పని షరుతులను రాష్ట్రపతి నిర్ణయిస్తారు. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుల నియామకం, పని షరతుల నిర్ణయం రాష్ట్ర గవర్నర్ బాధ్యత. అయితే, కమిషన్ సభ్యులను తొలగించే (అన్ని సర్వీస్ కమిషన్ల) అధికారం రాష్ట్రపతికి మాత్రమే ఉంది. యూనియన్ కమిషన్ సభ్యుల పదవీ కాలం ఆరు సంవత్సరాలు, లేదా 65 సంవత్సరాలు వయస్సు వచ్చేంత వరకు.. ఏది ముందైతే అది. రాష్ట్ర/ఉమ్మడి కమిషన్ సభ్యుల పదవీకాలం ఆరు సంవత్సరాలు, లేదా 62 సంవత్సరాలు వయస్సు వచ్చేంతవరకు - ఏదిముందైతే అది. ఈ వ్యవస్థల స్వయం ప్రతిపత్తిని కాపాడటానికి కింది రక్షణలు చేశారు. ఎ) పదవీ కాలంలో సభ్యుల ప్రయోజనాలకు భంగం కలిగే విధంగా పని షరతులను మార్చకూడదు. బి) జీతభత్యాలు సంబంధిత సంఘటిత నిధి నుంచి చెల్లించాలి. సి) పదవీ విరమణ తర్వాత కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలలో ఆదాయన్నిచ్చే ఏ పదవినీ స్వీకరించ కూడదు. డి) యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్‌గా పని చేసిన వ్యక్తి. పదవీ కాలం పూర్తయ్యాక, రెండోసారి సర్వీస్ కమిషన్‌లో ఎలాంటి హోదాలో పని చేయడానికి వీల్లేదు. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్‌ను ఇతర రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్‌గా కాని, కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో ఛైర్మన్/సభ్యుడిగా కాని నియమించవచ్చు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడిని.. దాని ఛైర్మన్‌గా కాని, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్‌గా కాని నియమించవచ్చు. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడిని.. యూనియన్/రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్‌గా, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడిగా నియమించవచ్చు. సభ్యులు స్వచ్ఛందంగా పదవీ విరమణ చేయవచ్చు. దుష్ప్రవర్తన కారణంగా రాష్ట్రపతి.. సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించి, వారి సిఫార్సు మేరకు సభ్యుడిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటారు. దివాళా తీసినా.. శారీరకంగా/ మానసికంగా అశక్తులైనా... ఆదాయాన్నిచ్చే పదవిలో కొనసాగుతున్నా... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించి ఆదాయాన్నిచ్చే కాంట్రాక్ట్ కలిగి ఉన్నా - రాష్ట్రపతి స్వతంత్రంగా క్రమశిక్షణా చర్యలు తీసుకోవచ్చు. గవర్నర్‌కు తాత్కాలికంగా సస్పెండ్ చేసే అధికారం మాత్రమే ఉంది.

సర్వీసు కమిషన్‌లు ప్రధానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరపున అభ్యర్థుల అర్హతలను అంచనా వేసి సంబంధిత ఉద్యోగాలకు సిఫార్సు చేస్తాయి. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్... అఖిల భారత, కేంద్ర (ఎ, బి తరగతులకు) సర్వీసులకు; రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్... రాష్ట్రంలో ప్రభుత్వం నిర్ణయించిన సర్వీస్‌లకు భర్తీ ప్రక్రియ నిర్వహిస్తాయి. కేంద్రంలో స్టాఫ్ సెలక్షన్ కమిషన్, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డులు భర్తీ ప్రక్రియ నిర్వహిస్తాయి. రాష్ట్రపతి/గవర్నర్లు తమకు పంపిన విషయాలపై సలహాలిస్తాయి. వీటి అధికారాలను చట్టాల ద్వారా, కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా విస్తృతం చేయవచ్చు/తగ్గించవచ్చు. 320 రాజ్యాంగ ప్రకరణ కింద, యూనియన్/రాష్ట్ర సర్వీస్ కమిషన్‌లను ఈ కింది విషయాలలో సంప్రదిస్తారు...

ఎ) ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి సంబంధించిన విషయాలు

బి) అంతర్‌శాఖీయ బదిలీలు, పదోన్నతులు

సి) క్రమశిక్షణ చర్యలు

డి) అధికారయుత విధుల నిర్వహణలో తలెత్తిన చట్టపరమైన వివాదాల పరిష్కారానికి న్యాయస్థానాలను ఆశ్రయించినప్పుడు అయిన ఖర్చును ఆ ఉద్యోగి చెల్లించే విషయంలో.. ఇ) విధి నిర్వ హణలో ప్రమాదానికి గురి అయినప్పుడు,ఉద్యోగికి ప్రభుత్వం చెల్లించవలసిన నష్టపరిహారం విషయంలో. కమిషన్‌లు తమ వార్షిక నివేదికలను రాష్ట్రపతి, గవర్నర్లకు సమర్పిస్తే... వాటిని పార్లమెంట్/ శాసనసభకు నివేదిస్తారు.

పనితీరు సమీక్ష:

సభ్యుల నియామకాల విషయంలో.. రాజకీయ జోక్యం పెరిగిపోతోందనే విమర్శ ఉంది. అందువల్ల పార్లమెంట్/ శాసనసభలో ప్రతిపక్షనాయకుని,స్పీకరును సంప్రదించి సభ్యులను నియమిస్తే మంచిది. ప్రభుత్వం అనేక సందర్భాలలో కొన్ని ఉద్యోగాలను కమిషన్ల పరిధినుంచి తప్పించి... శాఖాపరంగా భర్తీ చేస్తున్నాయనే విమర్శ కూడ

వినిపిస్తోంది. వార్షిక నివేదికలను ప్రజాప్రతి నిధులు శ్రద్ధగా అధ్యయనం చేయడం లేదు!!

ముఖ్యాంశాలు

- మన దేశంలో ఆర్థిక సంఘమనే రాజ్యాంగబద్ధ వ్యవస్థ ఏర్పాటుకు రాజ్యాంగంలోని 280వ ప్రకరణ అవకాశం కల్పిస్తోంది.
- 13వ ఆర్థిక సంఘాన్ని 2007, నవం బరులో విజయ్ కేల్కర్ అధ్యక్షతన ఏర్పాటుచేశారు. ప్రణాళికాసంఘ సభ్యుడు బి.కె.చతుర్వేది భాగకాలిక (Parttime) సభ్యుడిగా.. ఇందిరా రాజారామన్, అబుసాలే షరీఫ్, అతుల్‌శర్మ పూర్తికాల సభ్యులు గా... సుమిత్‌బోస్ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఇది 31.10.2009 నాటికి తన నివేదిక ను సమర్పించే అవకాశం ఉంది.
- బ్రిటిషర్ల పాలనలో 1919, 1935 భారత ప్రభుత్వ చట్టాల మేరకు కేంద్ర, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ఏర్పాటయ్యాయి.
- రాజ్యాంగంలోని 315వ ప్రకరణ కింద యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్.. రెండు లేక అంతకంటే ఎక్కువ రాష్ట్రాలు కోరితే ఉమ్మడి పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ఏర్పాటు చేయవచ్చు.
- యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్... అఖిల భారత, కేంద్ర (ఎ, బి తరగతులకు) సర్వీసులకు; రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్... రాష్ట్రంలో ప్రభుత్వం నిర్ణయించిన సర్వీస్‌లకు భర్తీ ప్రక్రియ నిర్వహిస్తాయి.